**సొంతదో, సొంతం చేసుకున్నదో కానీ ఒకానొక అనుభవం
కథకి మూలమైతే, ఆ నివేదనకీ సంవేదనకీ వేదనానుభవమే కారణమైతే
ఆ మూలాన్ని లేదా కారణాన్ని కాకుంటే ప్రేరణనీ తలుచుకోవడం,
తప్పుకోవడం చాలా కష్టంగా ఉంటుంది.**

ఉమా నూతక్కి

# 17 మిట్టమధ్యాన్నపు నీడ

ఎ. ఆంజనేయులు





మిట్టమధ్యాన్నపు నీడ... చల్లని స్పర్శల నలుపు కాదు చిత్తడి రొచ్చుల తెలుపు...

పట్టపగటి ఎండ కాదు... గుడ్లగూబల రాత్రి కార్చే రసి...

గుడ్డు చిదిపిన పాము పాకి వెగటు జిగటల గిజురు...

ఊసరవెల్లి శ్లేష్మంలో ఊపిరి గిజగిజ...

బొద్దింక నెత్తుటి మరక... బొచ్చుపురుగు పారాడిన దద్దురు...

అసహ్యం తాకింది... చీదర అంటింది... రోత ఒరిసింది...

గుండెని చీల్చిన కేక గొంతు దాటడంలేదు...

గట్లు తెగిన ఘోష కంట్లో ఆగడంలేదు...

ప్రాణం లుంగలు చుట్టుకుపోతోంది... దుఃఖం ముంచెత్తుతోంది...

ఎక్కిళ్లు... ఎగశ్వాస...

అమ్మా... అమ్మా...

* * *

మిథునా... మిథునా...

ఎవరో భుజాలు కుదుపుతున్న స్పర్శకి దిగ్గున లేచింది మిథున, ఆ చేతుల్ని విదిలించి కొడుతూ.

ఆందోళన, అయోమయం అర్జున్ ముఖంలో. అంత నిద్రలో కూడా తనని విదిల్చి కొట్టిందని చిన్నబుచ్చుకున్నట్టు కూడా తెలుస్తోంది.

మెల్లగా తేరుకొని చెప్పింది మిథున- "సారీ, అర్జున్."

"ఏమయ్యింది... "

అడగటం అతనికి మొదలుకాదు, మౌనం ఆమెకి కొత్తా కాదు.

దూరంగా జరగబోతున్న అతని మెడ చుట్టూ చేతులు వేసి గుండెల్లో తల పెట్టుకుంది మిథున. ఆమె కళ్లతడి స్పర్శ తెలుస్తోంది అతనికి. అతని మనసు నీరయిపోతోంది. సంకోచంగా ఆగిపోతున్న అతన్ని అల్లుకుపోయింది.

* * *

పసిపాపలా అతని గుండెలమీద నిద్రపోతోంది మిథున. కానీ అప్పుడప్పుడూ ముడతపడుతున్న భ్రుకుటి చూస్తుంటే ఆమె కలల్లో సంచరిస్తున్న చీకట్లు కనిపిస్తున్నాయతనికి. పసిపాపలా పడుకున్న మిథునని చూస్తే ఒక్కసారి అతని మనసు ప్రేమతో నిండిపోయింది. ఆమెని అంత కలవరపెడుతున్న విషయం ఏమిటి??

లేచి బయటకి వచ్చి బాల్కనీలో నుంచున్నాడు అర్జున్. అతనికి ఏమీ అర్థం కావట్లేదు. కానీ, ఏదో ఒకటి చేయాలి. ఎప్పుడూ నవ్వుతూ తుళ్లుతూ ఉండే మిథున హఠాత్తుగా నిద్రలో పడుతున్న వేదన అతన్ని విస్మయానికి గురిచేస్తుంటుంది. ఒకవేళ ఆమెకి తనతో పెళ్లి ఇష్టంలేదా అంటే, ఆ అవకాశం కూడా లేదు. మిథున అతని మేనత్త కూతురు. చిన్నప్పటి నుంచి కలిసి పెరిగారు. ఇద్దరికీ నాలుగేళ్లు తేడా. హాస్పిటల్‌లో మిథున పుట్టినప్పుడు నాయనమ్మ పొత్తిళ్లలో గులాబీమొగ్గలా ఉన్న పసిపాపని అమ్మ చాటునుంచి చూస్తున్నప్పుడు, 'నీ పెళ్లాం రా,' అని నాయనమ్మ చెప్పడం, అదేమిటో అర్థం కాకపోయినా సిగ్గుపడుతూ దగ్గరకి వెళ్లి బుజ్జి మిథున బుగ్గలు మెల్లగా తాకడం ఇప్పటికీ గుర్తే అర్జున్‌కి.

మిథున చిన్నప్పుడు అత్తయ్యావాళ్లు ఒరిస్సాలో ఉండేవాళ్లు. ప్రతీ శెలవలకీ తను వెళ్లేవాడు. నాయనమ్మ ప్రాణంతీసి తీసుకెళ్లేదాకా గొడవ చేసేవాడు. లేకపోతే అత్తయ్యే పిల్లల్ని తీసుకు వచ్చేది. మిథున ఉన్నన్ని రోజులూ అతనికి వేరే ప్రపంచం ఉండేదికాదు. ఇద్దరూ కలిసి ఆడుకున్న బొమ్మలాటల దగ్గర్నించి ఏమీ మర్చిపోలేదతను. అర్జున్ దృష్టిలో ఆమె ఒక అద్భుతం, అప్పుడూ, ఇప్పుడూనూ. ఆ తర్వాత అతను పదోతరగతి చదువుతుండగా, తండ్రికి అమెరికాలో ఉద్యోగం రావడంతో అతను కూడా వెళ్లిపోయాడు. రెండేళ్లకి ఒకసారి తను వచ్చినప్పుడల్లా అత్తయ్య ఇంట్లోనే ఎక్కువ ఉండేవాడు. చిన్నప్పుడు గలగలా పారే గోదారిలా ఉండే మిథున రానురానూ గంభీరంగా మారిపోయింది. అయినా తనపట్ల ఆమె చూపించే ప్రేమ మాత్రం అలానే ఉండేది. చివరికి తమ పెళ్లి గురించిన ప్రపోజల్ పెద్దవాళ్లు తెచ్చినప్పుడు రక్త సంబంధమని అర్జున్ సంకోచిస్తోంటే మిథునే ముందు ఒప్పుకుని, తనని కూడా ఒప్పించింది.

* * *

ఎప్పుడు వచ్చిందో వెనకనుంచి వచ్చి గట్టిగా అతన్ని హత్తుకుంది మిథున.

ఆలోచనల్లోంచి తేరుకుని, "ఏమయ్యిందిరా... ఎప్పటి కలేనా..." అడిగాడు అర్జున్.

ఏమీ సమాధానం చెప్పలేదామె. బలహీనంగా నవ్వి, "పడుకుందామా, నీకు రేపు కాన్ఫరెన్స్ ఉందన్నావ్," లోపలికి వెళ్తూ అంది.

లాభంలేదు, నాయనమ్మతో మాట్లాడాలి అనుకుంటూ లోపలికి వెళ్లి పడుకున్నాడు.

పొద్దున్నే అర్జున్ లేచేటప్పటికే మిథున దాదాపుగా వంట పూర్తి చేసేసింది. రాత్రి తాలూకు నలత ఆమె మొహంలో కొంత కనిపిస్తోందిగానీ, సహజంగా తనలో ఉండే హుషారు నీరసాన్ని డామినేట్ చేస్తోంది.

"కాన్ఫరెన్స్ ఎటెండ్ అవ్వాలిగా, ముందు నువ్వెళ్లిపో, మన ఆఫీసుకి నేను తర్వాత వెళ్తా," అర్జున్‌కి రెండోసారి కాఫీ ఇస్తూ చెప్పింది. పెళ్లికి ముందు హైదరాబాద్‌లో వర్క్ చేసేది. ఆరునెలల క్రితం పెళ్లి అయ్యాక, పాత కంపెనీకి రిజైన్ చేసి అర్జున్ కంపెనీలోనే చేరింది.

బ్యాగ్, కార్ కీస్ తీసుకుని బయటకి వెళ్తున్న అతన్ని చేయి పట్టుకుని చిన్నపిల్లలా గుంజుతూ... "నా మామూలేదీ," చిలిపిగా అడిగింది. తనొక్కడే బయటకి వెళ్తుంటే ఆ మామూలిచ్చి వెళ్లాలి. తేరిపారా చూశాడు మిథునని; పీడకలల తొక్కిడిలో కళ్లంతా కుంకుమజీరలు పూశాయి. అయినా, ఎలాంటి కల్మషం లేకుండా పసిపాపలా నవ్వుతున్న ఆమెని దగ్గరకి తీసుకుని రెండు కళ్ల మీద మెత్తగా ముద్దు పెట్టుకున్నాడు.

"కాసేపు పడుకో. రాత్రి నిద్రలేదు నీకు," చెంప మీద తట్టి వెళ్లిపోయాడు బయటకి.

తలుపేసుకుంటుండగా ఎదురింటి తలుపు తెరుచుకుంది. ఎదురింటతను, అర్జున్ వయసే ఉంటుంది, ఆఫీస్‌కి బయలుదేరాడనుకుంటా.

ఓ పాపని ఎత్తుకున్నాడు. ఎత్తుకునేంత చిన్నదేంకాదు. పాప బుగ్గలు పుణుకుతున్నాడు, చెవులు మెలేస్తున్నాడు...

వెనకే మురిసిపోతూ అతని భార్య.

"అబ్బా వదులు మామా," కిలకిలా నవ్వుతోంది పాప. కానీ, గింజుకుంటోందని తెలుస్తోంది.

అటే చూస్తున్న మిథునతో, "మా అన్నయ్య కూతురు. వచ్చిందంటే ఇంక ఈయన వదిలిపెట్టరు," నవ్వుతూ చెప్పింది ఎదురింటామె.

"సాయంత్రం చెప్తా నీ పని," అతని చేతుల్లోంచి విడిపించుకొని దూకిన పాపని చూస్తూ అన్నాడతను.

భళ్లున తలుపేసుకుని పరిగెత్తుకుంటూ లోపలికి వెళ్లింది మిథున.

'సాయంత్రం చెప్తా నీ పని...!'

చీలికల నాల్కల పొడల పాము బుసలాంటి గుసగుస...

'ఇప్పుడు తప్పించుకున్నావ్... దొంగపిల్లా, సాయంత్రం చెప్తా....'

సా... యం... త్రం... చె...ప్తా... నీ... ప...ని...

పొగులుతున్న దుఃఖం... తన్నుకొస్తున్న కోపం...

తప్పించుకుందేగానీ, తూనీగ రెక్కలకి వదలని సాలీడు జిగురు...

ఏంటిది... తెమడ... చీమిడి... కాదు ఇంకేదో... నీలం ఫ్రాకుమీద తెల్లగా... చిక్కగా... తడిగా...

అంటుకోలేదు... అంటిచ్చాడు... ఎలుగుబంటి చేతులతో వెనక నుంచి చుట్టేసి... నోరు నొక్కేసి...

నడుం కింద గౌనుకేదో తాకుతుంది, అదేంటో సరిగా తెలియకపోయినా గుండెలోకి మాత్రం బాకులు దిగుతున్నాయి.

భయం... కంగారు... అసీయం.... సిగ్గు... ఏడుపు...

గాబు... కాగు... బొక్కెన... అన్నీ ఖాళీ!

పగుల్లిచ్చిన తొట్టిలో నిలవని నీళ్లు కంటిలోంచి కారిపోతున్నాయ్ ధారా పాతంగా.

ఓ చేత్తో పంపు కొట్టుకుంటూ మరోచేత్తో మరక తడుముకుంటూ... కడు క్కుంటూ... ముక్కు చీదుకుంటూ... కళ్లు తుడుచుకుంటూ...

ఎంత కడిగినా పోదేం... ఇన్నేళ్లయినా వదలదేం...

కడుక్కుంటుంది తను ఒక్కత్తేనా...

ఎదురింటి పాప...

'అబ్బా వదులు మామా...'

'సాయంత్రం చెప్తా నీ పని...'

ఏదో పూనకం పట్టినట్లు ఎదురింటి తలుపు కొట్టింది.

మండుతున్న కళ్లు... వణుకుతున్న పెదాలు... చెదిరిపోయిన జుత్తు... చెంపల మీద చారికలు...

మిథునని చూసి ఎదురింటామె కంగారుగా అడిగింది- "మిథునా, ఏమయ్యిం దండీ."

"బుజ్జి కుందేళ్ల వెనక తోడేళ్లు పొంచాయి.... డేగ తన్నుకు పోతుంది, కోడిపిల్లని దాచుకోవాలి."

మిథున మాటలకి అయోమయంగా చూసిందామె. ఇదేం పట్టించుకోకుండా కార్టూన్ చానెల్ ఏదో చూస్తున్న పాప వంక వేలు చూపిస్తూ, "పాప జాగ్రత్త..." అని గిర్రున వెనక్కి తిరిగింది మిథున.

* * *

"ప్రియమైన బావా...

సారీ...

కాదు... తడవ తడవకీ చెప్పే ఈ సారీలు ఇంక వద్దు బావా...

మనం విడిపోదాం..."

ఇంతకాలం అర్జున్‌కి చెప్పలేకపోయినదంతా ఉత్తరంలోకి దించుకొందామను కున్న మిథున, 'విడిపోదాం' అని రాశాక, పెన్ను పడేసి, చేతుల్తో ముఖం కప్పుకొని బావురుమంది.

కాటేయాలని, కబళించాలని చూసిన కట్లపాము దర్జాగా తిరుగుతుంటే, అభం శుభం తెలియని పసి పావురం బతుకంతా తల్లడిల్లాలా? ఎందుకు నాకింత శోకం... ఈ కన్నీటి ఖైదు నుంచి నాకు విడుదలే లేదా... ఎవడి నేరానికో నాకు శిక్షేంటి...

నా తోడు... నా ప్రాణం... నా బావతో విడిపోవడమా?

కానీ, నాతో తనకి సుఖం, శాంతి ఏమున్నాయ్, ఎంతకాలం భరించాలి?

తడిచి చివికిన కాగితం నలిపి పడేసి, మళ్లీ మొదలుబెట్టింది.

"బావా... గుర్తున్నాయి కదూ, ఒరిస్సాలో ఒక పల్లెటూరులో ఉండేవాళ్లం కదా మేము. నువ్వెలా మర్చిపోతావులే, సెలవలు వచ్చాయంటే చాలు, అత్తమ్మోళ్ల ఊరికి అంటూ అమ్మమ్మని సతాయించి లాక్కొచ్చేవాడివిగా. నాకప్పుడు పదేళ్లు, అంతేగా. పచ్చటి అడవీ, విశాలమైన కాలనీ, బోలెడు మంది స్నేహితులు, ఆడుకున్నన్ని ఆటలు, అప్పుడప్పుడూ వచ్చే నువ్వు- బాల్యం ఇంత అందంగా ఉంటుందా అనిపించే రోజులు కదా అవి. ఒకటే లోటు, ప్రాజెక్ట్ ఏరియా కాబట్టి ఇంటర్‌స్టేట్ ఎగ్రిమెంట్‌లో భాగంగా ఇంజనీర్లు, ఉద్యోగులూ తెలుగువాళ్లం కొద్దిమందే. అందుకే, స్కూల్‌లో మాత్రం ఒరియా మీడియం! చెట్టుదీ, పుట్టదీ భాషతో, యాసతో సంబంధం లేని ఘోష; మనకే కదా ఈ తేడాలు. ఇంట్లో అమ్మే చెప్పేది పుస్తకాలు తెప్పించి. అయితే, చదువింక సాగట్లేదని, విజయవాడలో కమలత్త (నాన్న రెండో చెల్లెలు- నువ్వు పోరంకి పిన్నీ అనేవాడివి గుర్తుందా... ) ఇంట్లో ఉంచారు నన్నూ, అక్కనీ. ఇంటిని ఆనుకునే స్కూల్ కాంపౌండ్.

చిన్నప్పటి నుంచి వేరే రాష్ట్రంలో పెరగడం, ప్రాజెక్ట్ ఏరియాలో ఉండే కాస్మో కల్చర్ వేరు వేరు భాషల స్నేహితులతో ఇంగ్లీషే మాధ్యమం కాబట్టి అలవోకగా వచ్చే మా ఇంగ్లీషు పదాలు, వచ్చీరాని మా తెలుగు... అవన్నీ అప్పటి ఆ స్కూల్‌కి హాట్ టాపిక్స్. కమలత్త, భుజంగరావ్ మామయ్య వాళ్ల ఇద్దరు పిల్లలూ మా ఈడువాళ్లే. కానీ, కమలత్త మాతో బండెడు చాకిరీ చేయించేది. అక్క నాకంటే పెద్దదనేగానీ, ఎంత ఒక్క ఏడాదేగా. తనూ చిన్నపిల్లే. బారెడు జుట్టుండేది దానికి. తను నూనె

రాసుకుని జడేసుకుని, నాకు కూడా వేసేది. కొట్టుడు పంపుతో పెద్ద గాబునిండా నీళ్లు కొట్టి పోయాలి. నేను రెండు బక్కెట్లు కొట్టాక చేయి నొప్పెట్టి చూసుకుంటుంటే, నన్ను పక్కన కూర్చోపెట్టి అక్కే మొత్తం కొట్టిపోసేది. ఆరిందలా అన్నివిధాలా కాపు కాసేది నన్ను. చదువూ, ఆటపాటలు, పనీ ఇవన్నీ ఒక ఎత్తు. కానీ, భుజంగం మామయ్య రూపంలో ఆ రాక్షసుడు ఒక ఎత్తు. ముద్దు చేస్తున్నట్టు దగ్గర తీస్తుండే వాడు. ఆ తాకుడులోనే తేడా తెలిసిపోయేది. సాయంత్రం అయితే ఏదో అసౌకర్యం నన్ను చంపేసేది. తప్పించుకు తిరగడంతోనే సరిపోయేది నా టైమంతా. అతను దగ్గరకి తీసుకొని వేళ్లతో తడుముతున్నప్పుడల్లా నల్ల పొడలబల్లి పాకినట్లు అనిపించేది.

ఓరోజు మధ్యాహ్నం డ్రిల్ పీరియడ్. స్కిప్పింగ్ రోప్ మర్చిపోయి ఇంటికి వచ్చాను. అల్మారాలో వెతుక్కుంటుంటే, వెనకగా ఏదో కదిలినట్టు నీడ. మెడమీద నుంచి కిందకి చేతులు సాచి చుట్టేసింది నీడ కంటే చిక్కనైన ఆ చీకటి. దడుచుకుని కేకవేయబోయిన నా నోరు మూసేసాతడతను. గింజుకుంటూనే ఉన్నా, వదలట్లేదు, వెనక నుంచి ఇంకా బలంగా ఒత్తుకుంటూ. కాళ్లతో నేలని తంతూ విరగబడుతున్నా... రక్కుతున్నా... ఏడుస్తున్నా...

వెనక స్కర్ట్‌కి ఏదో గట్టిగా తగులుతుంది, తడిగా జిగటగా తాకుతుంది.

బైట అలికిడి అయినట్లనిపిస్తే వదిలేశాడు.

కమలత్త వచ్చింది, ములగచెట్టు నిండా గొంగళిపురుగులే, కొమ్మల కింద మంటపెట్టి వస్తున్నానని తనకి తాను చెప్పుకున్నట్టు చెబుతోంది, నన్నుగానీ, ఆ నీచుడ్ని కానీ పట్టించుకోకుండా.

"సాయంత్రం చెప్తా నీ పని," మంద్రగబ్బ కొండె తర్జనిలా ఊపుతూ బెదిరించింది.

స్కర్ట్ వెనకంతా ఇంత వెడల్పున తెల్లటి జిగురు డాగు. చీదరేస్తుంది, రోత పుడుతుంది...

అప్పుడు స్కూల్‌కి ఎలా వెళ్లడం. నాకున్నవి రెండే స్కూల్ యూనిఫామ్స్. రెండోది పొద్దున్న అక్కే ఉతికింది. చిట్టి చిట్టి చేతుల్తో తను ఉతికి పిండీ పిండకుండా ఆరేసే ఆ స్కర్ట్స్ తర్వాత రోజు పొద్దున్నకే ఇంకా మెత్తగా చెమ్మగా ఉండేవి. అలానే వేసుకెళ్లేవాళ్లం. ఇప్పుడు మార్చుకునే అవకాశమే లేదు. అలానే ఏడ్చుకుంటూనే ఎలాగో కడుక్కుని, గుంజుకుని అప్పటికైతే వెళ్లాను కానీ, బావా...! ఇంకా ఆ చీదర వదలడం లేదు.

స్కర్టు వెనక అంటుకున్న మైల... మాలిన్య... స్ఖలన... వీర్యపాతాలన్నీ పొంగి... పోటెత్తి జుగుప్సా ప్రవాహాల వైతరణై నా లక్కపిడతల్ని... నా గుజ్జనగూళ్లని... నా ఆశల్ని... ఆ ఆకాశాల్నీ మొత్తంగా ముంచెత్తింది.

"...తప్పించుకున్నావ్ దొంగపిల్లా, సాయంత్రం..."

సాయంత్రమయ్యింది... నీడ ఇంకా పొడవయ్యింది, నీడ చేతులు బారెడ య్యాయి, ఆ చేతుల బారి నుంచి తప్పించుకోవడానికే మొత్తం శక్తులు, యుక్తులన్నీ ఖర్చైపోయాయి.

రెండ్రోజుల్లో దేవుడు పంపించినట్టు వచ్చింది అమ్మమ్మ, పిల్లలకి తిండి అమురుతుందో లేదో అని సున్నుండలు, చిమ్మిరుండలు తెచ్చింది.

"నేను రాత్రికి పిల్లల దగ్గర పడుకుంటాలే, పిన్ని వచ్చిందిగా...." ఎనౌన్స్ చేసాడతను.

అమ్మమ్మని కరుచుకుపోయా, 'వెళ్లిపోదాం అమ్మమ్మా, ఇక్కడ ఉండను...' అంటూ. పెనంలా కాలిపోతున్న ఒంటిని చూసి అమ్మమ్మ గాబరా పడింది. రాత్రికి మొలిచిన కోరలతో, మళ్లీ అదే నీడ. బెడ్‌లాంప్ గుడ్డి వెలుతురులో ఒంటి మీదంతా పరచుకునే నీడ. అమ్మమ్మ పసిగట్టినట్టుంది. మర్నాడు అక్కడ పెరట్లో అమ్మమ్మ అతనితో మాట్లాడడం చూసా నేను. మేం స్కూల్ నుంచి వచ్చాక అమ్మమ్మ వెళ్లిపో తుంటే ఎప్పుడూ లేనంత గుక్క పెట్టి ఏడ్చా. దగ్గరకి తీసుకోబోతుంటే 'నొప్పి' అంటూ అరిచి వెనక్కి వెళ్లిపోయా. గుండెల మీద నెప్పి. ఎర్రటి మచ్చలు. వెనక నీడ పడితే భయం, వెనక నుంచి ఎవరైనా భుజం మీద చేయి వేస్తే భయం, వెనక నుంచి లారీ వస్తుంటే భయం."

ఇంక రాయలేకపోయింది మిథున. అణచిపెట్టుకున్న వేదన అక్షరాల్లోకి రావడానికి తన్నుకులాడుతుంటే, తను రాసింది తనకే పేలవంగా అనిపించి పెద్దగా అరుస్తూ రాసిన పేజీలని ముక్కలు ముక్కలుగా చింపేసింది.

* * *

కాన్ఫరెన్స్ మొదలవ్వడానికి కొంత టైం ఉందింకా. తోచక మిథునకి మెసేజ్ పెట్టాడు అర్జున్. రిప్లై రాకపోతే పడుకుందేమో అని వదిలేశాడు. కానీ అతనికి రాత్రి సంఘటన ఇంకా కళ్లముందు నుంచి పోవట్లేదు. అది మొదటిసారి కాకపోయినా, అలవాటు కాలేకపోతున్నాడు. గురక పెట్టడం, కాళ్లు కదల్చడం, పళ్లు నూరడం వంటి నిద్రాసమస్యలు కాదుకదా అలవాటైపోవడానికి. ఏ కరుకు కలల ఒరిపిడిలో నలిగి, ఏ చేదు గుర్తులు రాపాడితేనో కమిలి, చెప్పుకోలేని ఏ అనుభవాల పెనుగాలులకో అల్లాడి అతలాకుతలమౌతున్న సహచరి, చిన్ననాటి ప్రియనేస్తం పెనుగులాట అలవాటెలా అవుతుంది, ఏమీ చేయలేకపోతున్న నిస్సహాయతలో.

తన టెన్త్ తర్వాత అమెరికా వెళ్లిపోయాక, చదువూ ఉద్యోగం అంతా అక్కడే. చిన్నప్పుడు ఎంతో చలాకీగా ఉన్న మిథున, ఎందుకో సడన్‌గా ముభావంగా మారిపో

యింది. తాను అమెరికా వెళ్లకముందు మూడేళ్లూ ఆ మార్పు తనకి అర్థమయ్యింది. మూడేళ్ల క్రితం తమ పెళ్లి అనుకున్నాక అందరికీ దగ్గరగా ఉందామని వైజాగ్ వచ్చేశాడతను. ఒక స్టార్ట్ అప్ పెట్టుకుని డెవెలప్ చేశాడు. అంతకుముందు, మధ్య మధ్యలో వచ్చినా గంభీరంగా ఉండే మిథున దగ్గర తన మనసు విప్పలేదతను. నాయనమ్మ తమ పెళ్లికి తొందరపెడుతుంటే, మేనరికాల గురించి విని ఉన్నాడు, చదువుకున్నాడు కాబట్టి సంకోచించాడు. కానీ, మిథునే తనతో మాట్లాడింది. 'నిన్ను తప్ప ఎవరినీ చేసుకోను బావా,' అని స్పష్టంగా చెప్పింది. తనంటే ప్రాణం ఇస్తుంది. అమ్మా, నాన్నని ప్రేమగా చూసుకుంటుంది. అంతా బాగుంటుంది. తనంటే ఆమెకి ఇష్టం లేదన్న భయమే లేదు. మరి అప్పుడప్పుడూ మిథున పడుతున్న సంఘర్షణ, తనంత తాను చొరవగా తన దగ్గరకు వచ్చి అల్లుకుపోయే మిథునకి, తను దగ్గరకి వెళ్లినప్పుడు వైల్డ్‌గా రియాక్ట్ అయ్యే మిథునకి మధ్య అతను నలిగిపోతున్నాడు. ఏదో జరిగింది. అతనికి అర్థం కావట్లేదు.

కోటు జేబులోంచి ఫోన్ తీసి డయల్ చేశాడు అటువైపు లిఫ్ట్ చేయగానే, 'నాయనమ్మా...' అంటూ మాట్లాడడం మొదలుపెట్టాడు. కాన్ఫరెన్స్ మొదలవుతుండగా ఫోన్ పెట్టేసి, 'నాయనమ్మ వస్తోందోయ్...' వాట్సాప్ చేశాడు భార్యకి.

* * *

కరెక్ట్ టైంకి వచ్చేసింది గోదావరి. ట్రైన్‌లోంచి బ్యాగ్ దించుతూ, "ఏంటి ఇంత తేలిగ్గా ఉంది. తినడానికేం తేలేదా..." గునాయిస్తున్న మనవడి నెత్తిమీద ప్రేమగా మొట్టి, "అంత టైం ఎక్కడ ఇచ్చావ్‌రా. అయినా ఇక్కడ దొరకని సామానేం ఉన్నాయి నాన్నా, చేసిపెడతాలే," అంది సరోజినమ్మ- అర్జున్ నాయనమ్మ, మిథున అమ్మమ్మ.

పచ్చటిఛాయలో మెరిసిపోయే నిలువెత్తు మనిషామె. అర్జున్‌కి అన్నీ నాయనమ్మ పోలికలే. ఎనభై సంవత్సరాల వయసులో కూడా ఆరోగ్యంగా ఉంటుందామె. తొమ్మిదిమంది పిల్లలకి, పాతికమంది మనవ సంతానానికి స్ట్రెస్ రిలీవర్, ప్రాబ్లం సాల్వర్, ఆల్ ఇన్ వన్ గైడ్ ఆమె. కారెక్కి కూర్చోగానే మనవడి మొహంలోకి చూస్తూ, ఏంటి సంగతని అడిగింది.

"మిథున..." చెప్పాడు అర్జున్. నాయనమ్మ అతనికి గొప్ప స్నేహితురాలు. దాచేవేం లేవు ఆమె దగ్గర.

"దుడుకుగా ఉంటున్నావా," నవ్వుతూ అడిగిందామె.

"తమరి వదనం. అంత సీన్‌లేదు. వణికిస్తోంది తల్లీ," తలకొట్టుకుంటూ అన్నాడు, "ఎక్కడైనా కాఫీ తాగిపోదామా?"

నాయనమ్మ అలసిపోయి ఉంటుందని తెలుసతనికి. కానీ అతని ఆరాటం నిలువనివ్వట్లేదు.

"ఊహూ, ముందు మిథునని చూడాలి."

ఆమెకి అంతా అర్థం అవుతోంది. ముందు మనవరాలిని చూడాలి. ఆమె మనసు కొట్టుకుపోతోంది. మిథునని చూడగానే ఆమె మనసు నీరయిపోయింది. కళ్లకింద నలుపు చక్రాలు తిరుగుతోంది. కారు దిగగానే తనకన్నా ముందు అర్జున్ చేయి పట్టుకుని, చిన్నపిల్లలా గారం చేస్తూ ఏదో అడుగుతోంది. అతని చేయి పట్టుకున్న పద్ధతిలోనే పట్టేసింది సరోజినమ్మ. వాళ్లిద్దరి మధ్య ప్రేమ కనిపిస్తోంది. తృప్తిగా నిట్టూర్చి లోపలికి వెళ్లింది. టిఫన్లు అయ్యాక మిథునతో అన్నాడు అర్జున్- "ఈ రోజుకి నువ్వెళిపో. నాయనమ్మని ఎవరో బంధువుల ఇంటికి తీసుకెళ్లాలట."

మిథునకి కొంచం తెలుస్తోంది. కానీ, ఆరాలు తీసి అడిగే మనస్తత్వం కాదామెది. ఆమె కూడా పోరాటం చేస్తూనే ఉంది. అమ్మమ్మే ఏదో ఒకటి చేయాలి, బయటకి వస్తూ, "బావా!" నెమ్మదిగా పిలిచింది అర్జున్ని.

"నాకు కొంచం అర్థమౌతోంది, అమ్మమ్మ ఎందుకు వచ్చిందో. నువ్వు సంతోషంగా ఉండాలి బావా. నాకే ఎలా బయటకి రావాలో తెలియట్లేదు. నిస్సహాయంగా ఉంది. మనం విడిపోదాం."

దుఃఖంతో గొంతు పూడుకుపోతోంది ఆమెకి. "మిథునా..." నాయనమ్మ ఉందని కూడా ఆలోచించలేదతను. దగ్గరకి తీసుకుని రెండు తడికళ్లనీ ముద్దాడాడు. "Never and ever..." అని నవ్వేసి పంపించాడామెని ఆఫీసుకి.

వెనక్కి తిరిగేటప్పటికి సోఫాలో కూర్చుని ఇద్దర్నీ చూస్తున్న నాయనమ్మ కనిపించింది. వెళ్లి ఒళ్లో తల పెట్టుకున్నాడు. మనవడి తలని ఆప్యాయంగా దువ్వుతూ మొదలుపెట్టిందామె. జరిగిందంతా చెప్పింది మనవడికి.

"అక్కాచెల్లెళ్లని వెంటనే అక్కడ నుంచి తీసుకొచ్చేశాం. తర్వాత మీ అత్తయ్య వాళ్లు ఆంధ్రా వచ్చేశారు. ఇంకా అంతా బాగానే ఉందనుకున్నాం. కానీ అనుకున్నంత సాఫీగా అవ్వలేదు. కొత్తలో అంతా మర్చిపోయినట్లే ఉంది మిథున. కానీ , లోలోపల ఉన్న గాయం వయసు పెరిగేకొద్దీ ఆఖరికి, స్కూల్లో బయలాజికల్ సైన్సెస్ పాఠాల దగర్నించి ఏ సంఘటన జరిగినా ఆమెలో లోపల ఉన్న జ్ఞాపకాలు బయటకి వచ్చేవి. పెద్దవుతున్నకొద్దీ తన మీద జరిగిన దాడి తీవ్రతని తను మరింత తీసుకుంది. అలా డిస్టర్బ్ అయినప్పుడల్లా వదలకుండా జ్వరం వేధించేది. ఏమీ జరగనట్లు అమ్మా, నాన్న మేనత్త కుటుంబంతో ఉండడం తట్టుకోలేకపోయేది.

‘‘పెళ్లిళ్లకి, ఫంక్షన్లకి మిథునని తీసుకెళ్లడం ఒక పెద్ద ప్రహసనం అయ్యేది. చదువులో, మిగిలిన అన్ని విషయాల్లో చురుగ్గా ఉండేది. గుంపులో కలవడానికి విపరీతంగా భయపడేది. ఒక్కతే ఉన్నప్పుడు గోడని ఆనుకుని నుంచునేది. ఎందుకూ, పడిపోతావా అని ఏడిపించేవాళ్లు స్నేహితులు. కానీ, వెనక నుంచి ఎవరన్నా పట్టుకుంటారని భయం. లారీలంటే భయపడేది. వెనకనుంచి లారీ వస్తుంటే వణికిపోయేది. ఏవరన్నా ఏడిపిస్తుంటే తట్టుకోలేక, తనని తానే హింసించుకొని, కుమిలిపోయే మనస్తత్వాన్ని పెంచుకుంది. మనసు తల్లడిల్లినప్పుడు, ఎవరైనా ఏడిపించినప్పుడూ తనని తను గాయపరుచుకునేది. చాలామంది డాక్టర్లకు చూపించాం. కానీ వాడు దగ్గర బంధువు కదా, మిథున మామూలు మనిషయ్యేలోపు వాడెక్కడో ఓచోట తారసపడేవాడు. బయట ఎవరికీ వాడి గురించి చెప్పకపోవడం, తన కళ్లముందే వాడు గౌరవంగా తిరగడం, తన శరీరం మలినం అయిపోయిందన్న భ్రమ... మిథునని చాలా కృంగదీసింది. చివరికి పోయిన సంవత్సరం తను చనిపోయాక కొంత తేరుకుంది. పెళ్లికి సరేనంది. అయితే, నిన్ను తప్ప ఎవరినీ చేసుకోనంది. మేనరికమని అవనీ ఇవనీ అంటుంటే, నువ్వు ఒప్పుకోవని భయపడ్డాం. నువ్వు ఒప్పుకుని మా నెత్తి మీద పాలు పోశావ్. అంతా బాగుంది అనుకున్నాం కానీ, ఇంకా మామూలు మనిషవ్వలేదు,’’ ముగించింది నాయనమ్మ.

ఆందోళన పడుతున్న ఆమెని సర్దుతూ, ‘‘ఇది చాలా చిన్న విషయం నాయనమ్మ,’’ అని తేలిక చేయడానికి ప్రయత్నించాడు అర్జున్ నిట్టూర్చుతూ.

‘‘చిన్న విషయం కాదురా నాన్నా, చాలాచాలా పెద్ద విషయం. మనసుకి సోకే రోగాలకి మందులిస్తారే, వాళ్లకి చూపించాలేమోరా. కానీ, నలుగురికీ తెలిస్తే, పిచ్చి డాక్టర్ల దగ్గరికి తీసుకువెళ్తున్నారని, దాన్ని పిచ్చిదానిగా జమకడతారేమోనని దిగులుగా ఉందిరా,’’ అంటూ కళ్లొత్తుకుంది.

‘‘అట్లాంటిదేమీ అక్కర్లేదు, ఎలానో చెబుతాగానీ, ముందు అలా వంటగది సామ్రాజ్యాన్ని నీ చేతి కిందకి తెచ్చుకొని, అరటికాయ్ బజ్జీలు వేద్దువు పదా, ’’ అని హాస్యమాడుతూ ఆమెని కిచెన్‌వైపు తీసికెళ్లాడు. ఆమె శెనగపిండి కలుపుతుంటే, తనకి అందని ఎత్తులో ఉన్న వరిపిండి డబ్బా అందిస్తూ చెప్పాడు:

‘‘నువ్వన్నట్టు ఇది పెద్ద విషయమే నాయనమ్మా... అయితే, ఇప్పుడు సమస్య ఏమిటో తెలిసింది కాబట్టి పరిష్కారం దొరుకుతుందన్న నమ్మకం ఉంది నాకు. కాకపోతే చట్టుక్కున పోయే సమస్య కాదు. లేత మనసుకి తగిలిన గాయం ఇంకా ఎంత పచ్చిగా ఉందో మిథున కళ్లని చూస్తే తెలుస్తూనే ఉంటుంది. ఇప్పటిదాకా ఈ

గాయం లోతు తెలీదు నాకు. ఇక ఈ గాయాన్ని మానిపించి, మిథున మనసు మీద అలుపెరుగని నవ్వు పూయించే బాధ్యత నాది. మరింత ప్రేమ చూపించాలి నేను, తను గెలవగలదన్న భరోసానిచ్చే ప్రేమ... నేను చూసుకుంటా. నువ్వింక నిశ్చింతగా బజ్జీలేసేయ్... నీకు మతిమరుపు వచ్చేసిందని ఒప్పుకో, సోడాఉప్పు వేసావ్‌గానీ, ఉప్పు వెయ్యలేదు..."

* * *

"నాయనమ్మా... మిథునకి ఉప్పుగల్లు దిగదుడువు, ఎన్ని కళ్లు పడ్డాయో... ఈరోజు మరీ వడిలిపోయింది. మళ్లీ రేప్పొద్దునే ప్రయాణం కదా, ఉన్న ఈ ఒక్కరోజూ మనవరాలికి దిష్టి తీసుకో... అదిసరే, నెమలీ... (ప్రేమ ఎక్కువైతే అలానే పిలుస్తాడు...) నీ ఫ్రెండ్ ఆమధ్య చెప్పింది- తులిప్ గార్డెన్స్‌కి వెళ్లడం తన డ్రీమ్ అని. అప్పుడు నిన్ను చూపిస్తూ అన్నాను గుర్తుందా- మా ఇంట్లోనే ఉంది తులిప్ తోట అని, ఈ తుళ్లింతల తులిప్ వనంతో కలిసి, ఆ నెదర్లాండ్ తులిప్ తోపులకి వెళ్దాం, మీ మిత్రురాలు కుళ్లుకునేలా..." చెబుతున్నాడు, అర్జున్ మిథునతో.

ఇద్దర్నీ చూస్తూ సరోజినమ్మ తడికళ్లు మెరిశాయి.

*మీ టూ కథాసంకలనం*
*డిసెంబర్ 2019*

*




23 ఆగస్ట్ 1972న విజయవాడలో పుట్టిన **ఉమా నూతక్కి** మొదటి కథ *శిశిర* సారంగ అంతర్జాల పత్రికలో 2019లో వచ్చింది. ఇది రెండో కథ. ఎల్ఐసీలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు.

**చిరునామా:** **4-277/2, మారుతీనగర్, నవులూరు రోడ్,**
**మంగళగిరి-522 502**
***ఫోన్: 94409 05506 mahi.nuthakki@gmail.com***